
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ


తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 203 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.17.02.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# కాంగ్రెస్‌దే పైచేయి



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: మున్సిపల్ పాలక మండలి ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ జోరు కొనసాగింది. మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికల్లో సత్తా చాటింది.మొత్తం 116 మున్సిపాల్టీల్లో కోరం లేక 11 మున్సిపాల్టీల్లో ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. మిగిలిన 105 మున్సిపాల్టీల్లో మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. ఈ సందర్భంగా హంగ్ ఏర్పడిన మున్సిపాల్టీల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. మొత్తం 36 మున్సిపాల్టీల్లో హంగ్ ఏర్పడగా, 11 చోట్ల ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 25 హంగ్ ఏర్పడిన స్థానాల్లో 15 మున్సిపాల్టీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మరో 5 మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్, 4 చోట్ల ఇండిపెండెంట్లు, మరోచోట ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు గెలుచుకున్నాయి. దీనితో కాంగ్రెస్‌పార్టీ గెలిచిన మొత్తం మున్సిపాల్టీల సంఖ్య 81కి చేరింది(ఫలితాల ప్రకటన రోజు కాంగ్రెస్ 66 చోట్ల పూర్తి మెజారిటీ సాధించిన విషయం తెలిసిందే).

బీఆర్ఎస్ సంఖ్య 18కి పెరిగింది. (ఫలితాల రోజు పూర్తి మెజారిటీతో బీఆర్ఎస్ 13 చోట్ల గెలిచింది). అలాగే 7 కార్పొనేషన్లకు జరిగిన ఎన్నికల్లో ఐదింటిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ కార్పొరేషన్లను దక్కించుకున్నాయి. ఇండిపెండెంట్లు అదిలాబాద్, జమ్మికుంట, మహబూబాబాద్, భైంసా మున్సిపాల్టీలను గెలుచుకున్నారు. అయితే వీరంతా కాంగ్రెస్ మద్దతుతోనే గెలిచారు. వడ్డేపల్లి మున్సిపాల్టీలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గుర్తుపై గెలిచిన వారందరూ కాంగ్రెస్‌లో చేరామని ప్రకటించినప్పటికి అధికారికంగా ఎన్నికల సంఘం వారిని గుర్తించలేదు. దాంతో వారు ఫార్వర్డ్ బ్లాక్ నుంచే గెలిచారని ప్రకటించింది. మున్సిపాల్టీల్లో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో హస్తం హవా కొనసాగింది.

ఇక్కడ 80 శాతానికి పైగా చైర్మెన్ పదవులను ఆ పార్టీ దక్కించుకుంది. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చింది. మెదక్ జిల్లాలోని ఇంద్రేశం మున్సిపాల్టీలో కోరం లేక చైర్మెన్ ఎన్నిక వాయిదా పడింది. ఆ జిల్లాలో మిగిలిన 18 స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో 9 స్థానాలను దక్కించుకున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల మున్సిపాల్టీని ఆ పార్టీ కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ మున్సిపాల్టీలో ఒక్క స్థానం దక్కిన కాంగ్రెస్‌కు చైర్మెన్ పీఠం దక్కింది. ఇక్కడ మొత్తం 15 వార్డులుండగా.. బీఆర్ఎస్ 8, బీజేపీ 6, కాంగ్రెస్ ఒక్క వార్డులో గెలిచింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిల ఎక్స్ అఫిషియో ఓట్లతో ఆ సంఖ్య మూడుకు చేరింది. వారికి బీజేపీ సభ్యులు మద్దతు పలకడంతో ఒక స్థానంలో గెలిచిన హస్తం అమనగల్‌ను హస్తగతం చేసుకుంది.

5 కార్పొరేషన్లలో 'హస్తం'

మున్సిపల్ కార్పొరేషన్లలోనూ హస్తం జోరు కొనసాగింది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో 5 చోట్ల మేయర్ పదవిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి, రామగుండం మేయర్‌గా మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్‌గా పాతిపల్లి ఎల్లయ్య, మంచిర్యాల మేయర్‌గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్‌గా సల్ల రమ్య మహేశ్, మహబూబ్‌నగర్ మేయర్‌గా గుమల్ మమత, డిప్యూటీ మేయర్‌గా ఎం సురేందర్ రెడ్డి, నల్లగొండ మేయర్‌గా బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు.

నిజామాబాద్, నల్లగొండ డిప్యూటీ మేయరుగా ఎంఐఎంకు చెందిన సల్మాతాహిన్ ఎండీ.అష్రఫ్‌అలీ గెలిచారు. కొత్తగూడెం, నిజామాబాద్, నల్లగొండ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవులను ఏఐఎంఐఎం గెలుచుకుంది. కొత్తగూడెం మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ దక్కించుకుంది. ఆ పార్టీ కార్పొరేటర్ మూడ్ గణేశ్ మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఇక్కడ డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు చెందిన సిరిపురపు లలిత కుమారీకి దక్కింది. చివరి క్షణం వరకు ఉత్కంఠగా సాగిన కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు బీజేపీ వశమయ్యాయి. ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా, వై.సునీల్ రావు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు.

11 మున్సిపాల్టీల్లో ఎన్నిక వాయిదా

రాష్ట్రంలోని11 మున్సిపాల్టీల్లో వివిధ కారణాల వల్ల చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక వాయిదా పడింది. ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూర్ మున్సిపాల్టీల్లో ఎన్నిక వాయిదా పడ్డట్టు ఎన్నికల సంఘం తెలిపింది. గతంలో ఈసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కోరం లేక పోవడం, లేదా మరే ఇతర కారణాల వల్ల 16న జరగాల్సిన ఎన్నిక వాయిదా పడితే ఆ మరుసటి రోజు 17న నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే వాయిదా పడ్డ మున్సిపాల్టీల ఎన్నిక నిర్వహణ తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

# కవితతోనే అన్ని వర్గాల అభివృద్ధి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి కల్వకుంట్ల కవితతోనే సాధ్యమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య కుమారుడు మనోహర్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కావేటి మనోహర్ కుమార్, ఆయన సతీమణి సబిత, వారి అనుచరులు తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి కండువా కప్పి కవిత సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మనోహర్ కుమార్ మాట్లాడుతూ సామాజిక తెలంగాణ, సామాజిక న్యాయ సాధన కోసం పోరాడుతున్న కవితకు మద్దతుగా జాగృతిలో చేరానని సంతోషం వ్యక్తం చేశారు. నూతన రాజకీయ పంథాను అవలంబిస్తూ యువతకు ప్రాధాన్యత ఇస్తున్న కవితకు ప్రజల్లో మరింత ఆధరణ లభిస్తున్నదని తెలిపారు. తెలంగాణ జాగృతిని బలోపేతం చేయడానికి తాను పని చేస్తానని మనోహర్ కుమార్ స్పష్టం చేశారు.

# అధికారం కోసం దిగజారిన కాంగ్రెస్, బీజేపీ



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో అధికారం కోసం ఎజెండాలు అజెండాలను పక్కనపెట్టి కాంగ్రెస్, బీజేపీలు దిగజారిన రాజకీయాలకు పాల్పడ్డాయని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మార్పు అంటే బీజేపీతో జతకట్టడమేనా? ఇదేనా కాంగ్రెస్ తెస్తానన్న మార్పు అని సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 12 ఏండ్లుగా బీఆర్ఎస్‌ను బీజేపీకి బీ-టీమ్ అని కాంగ్రెస్, కాంగ్రెస్‌కి బీ టీమ్ అని బీజేపీ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలనీ, ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ అని నిరూపించాయని పేర్కొన్నారు. బీజేపీతో కలిసి సింగిల్ టీమ్‌గా కాంగ్రెస్ మారిపోయిందని తెలిపారు. ఈ అపవిత్ర కలయిక, ఈ అనైతిక పొత్తు ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న ఫెవికాల్ బంధం మున్సిపల్ ఫలితాలతో మరోసారి స్పష్టమైందని తెలిపారు. కేవలం బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా ఆ రెండు పార్టీలు సిద్ధాంతాలను గాలికొదిలేశాయనీ, రాష్ట్రంలో ఆ రెండు పార్టీలు ఒకటేనని మరోసారి రుజువు చేశాయనివిమర్శించారు. ఢిల్లీలో కొట్టుకున్నట్టు చేసి గల్లీలో మాత్రం చేతులు కలుపుతూ వాటాలు వేసుకుని పదవులు పంచుకుంటున్నాయని తెలిపారు. దీనికి అలియాబాద్, ఆమన్‌గల్, మెదక్, నర్సాపూర్ ఫలితాలే ప్రత్యక్ష సాక్ష్యమని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నడిపేది కాంగ్రెస్ సర్కారా? బీజేపీ సర్కారా?, లేదంటే బీజేపీ-టీడీపీతో కూడిన సంకీర్ణ సర్కారా?అని ప్రశ్నించారు. ఆలియాబాద్ నుంచి అమన్‌గల్ దాకా, మెట్‌పల్లి నుంచి మెదక్ దాకా సాగిస్తున్న ఈ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఒంటరిగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తా లేదని తెలిపారు. అందుకే బీజేపీతో కుమ్మక్కైందని విమర్శించారు. రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్‌ను నిలువరించి అధికారాన్ని చేపట్టడానికి ఏదో ఒక విధంగా ఫలితాలను తారుమారు చేస్తూ మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నాయని వివరించారు. రాహుల్ గాంధీ దేశమంతా బీజేపీ మీద పోరాటం చేస్తే.. ఇక్కడ రేవంత్‌రెడ్డి బీజేపీతో జత కడుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

# నేడు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) జన్మదిన వేడుకలు మంగళవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేత తలసాని సాయి కిరణ్ యాదవ్ చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు టి హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొంటారని వివరించారు. కేసీఆర్ 72వ జన్మదినోత్సవం సందర్భంగా 72 కిలోల కేక్ కట్టింగ్, కేసీఆర్‌పై రూపొందించిన ప్రత్యేక పాటను విడుదల చేసే కార్యక్రమాలుంటాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలుంటాయని చెప్పారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ కాంగ్రెస్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం చేసినా కాంగ్రెస్‌కు 42 శాతం ఓట్లు వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కిషోర్ గౌడ్, లక్ష్మణ్ మురిశెట్టి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్‌లో ముగ్గురు తెలుగు విద్యార్థుల సత్తా




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: జేఈఈ మెయిన్ పేపర్-1 ఫలితాలను సోమవారం ఎన్‌టీఏ అధికారులు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో 12 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోరును సాధించగా తెలుగు విద్యార్థులు ముగ్గురు సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్రం నుంచి వివాన్ శరద్ మహేశ్వరి, ఏపీ నుంచి నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్ 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. ఈ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 13,55,293 మంది రిజిస్టర్ చేసుకోగా.. 13,04,653 (96.26%) మంది హాజరయ్యారు. దేశంలో ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్ -1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. అదే విధంగా జనవరి 29న నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్-2 ఫలితాలను త్వరలో ప్రకటించనున్నారు. మరోవైపు, జేఈఈ మెయిన్ మలి విడత పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగు తోంది. మొదటి విడత పరీక్షలో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఏప్రిల్ 2 నుంచి 9 వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయి. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు ర్యాంకులను కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. ఇందులో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

# సమన్వయంతో ముందుకెళ్దాం

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:అభివృద్ధి విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల వాళ్లం పరస్పరం సహకరించుకుంటూ సమన్వయంతో ముందుకెళ్దామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ లో ఏపీ సీఎం చంద్రబాబుతో మంత్రి తుమ్మల భేటీ అయ్యారు. పునర్విభజనలో భాగంగా ఏపీకి కేటాయించిన భద్రాచలంలోని ఐదు గ్రామాలను తెలంగాణకు తిరిగి ఇచ్చేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉండటం వల్ల ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.

ఆ గ్రామాలు గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంక్లేవ్‌లా మారిపోయాయనీ, జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి ఆ గ్రామాల ప్రజలు దాదాపు 8 గంటలు ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా అనుసంధాన లోపం, భద్రతా సమస్యలు వంటి అంశాలు స్థానిక గిరిజన ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. భద్రాచలం రామాలయానికి సంబంధించిన భూభాగాల్లో కొంత భాగం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటం వల్ల దేవస్థానం పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనీ, భక్తులకు మెరుగైన సేవలు అందించాలంటే ఆ గ్రామాల విలీనం అవసరమని తుమ్మల అభిప్రాయపడ్డారు.

ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్‌కు



అత్యవసరంగా శాశ్వత మరమ్మత్తులు చేపట్టాల్సి ఉందనీ, ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 16,000 ఎకరాలకు సాగునీరు అందుతుండగా అందులో సుమారు 13,640 ఎకరాలు (85.25 శాతం) ఆంధ్రప్రదేశ్‌లో, 2,360 ఎకరాలు (14.75 శాతం) తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం రూ.92.20 కోట్లు అవసరమని అంచనాలున్నాయనీ, రెండు రాష్ట్రాలకు లబ్ది చేకూరుతున్న క్రమంలో ఖర్చును 85 :15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గోదావరి వరద రక్షణ కోసం నిర్మించిన భద్రాచలం కరకట్టలోని మూడో స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్న విషయాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. దాన్ని బాగు చేయించకపోతే భవిష్యత్తులో భారీ ప్రమాదానికి దారితీయొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని ఇప్పటికే తెలంగాణ ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని ప్రస్తావించారు. తక్షణమే సాంకేతిక పరిశీలన చేసి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, రెండు రాష్ట్రాల సమన్వయంతో శాశ్వత పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలని కోరారు.

# రైతులకు బోనస్ నిధులు విడుదల




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ రైతులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వరి బోనస్ బకాయిలకు సంబంధించి నిధులను విడుదల చేసింది. వరి రైతులకు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కోసం రూ.514.36 కోట్లు విడుదల చేస్తున్నట్టుప్రకటించింది. ఈ బోనస్ పంపిణీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన 2.17లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. ఈ నిధుల విడుదలతోపాటు పౌరసరఫరాల సంస్థ వరి బోనస్ కోసం రూ.1,939.58 కోట్లు విడుదల చేయనుంది. వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం, సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. కనీస మద్దతు ధర కంటే ఈ రూ.500అదనమనీ, ఈ బకాయిలు చెల్లింపుతో రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం కలుగుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

# నిర్మల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు ఏకగ్రీవం.....

## వరించిన అదృష్టం భార్య చైర్మన్ భర్త వైస్ చైర్మన్



నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న అప్పల గణేష్ కావ్య,



నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న అప్పల గణేష్ చక్రవర్తి,




మున్సిపల్ చైర్మన్ కు వైస్ చైర్మన్ కు ప్రమాణ స్వీకార పత్రాలు అందజేస్తున్న అధికారులు




హాజరైన ఆల్ పార్టీ కౌన్సిలర్స్

నిర్మల్ ఫిబ్రవరి 16 అమృత్ తెలంగాణ నిర్మల్ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తైంది. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నియమించిన అధికారిగా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన 42 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశానికి జనరల్ అబ్జర్వర్ వీరారెడ్డి హాజరయ్యారు. కోరం పూర్తి కావడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా అప్పాల కావ్య ఎన్నికయ్యారు. ప్రతిపాదకుడిగా కత్తి నరేందర్, బలపరిచిన వారిగా ఎం.డి. ఇమాన్ ఉల్లా ఉన్నారు. వైస్ చైర్‌పర్సన్‌గా అప్పాల గణేష్ చక్రవర్తి ఎన్నికయ్యారు. ప్రతిపాదకుడిగా తాజ్ అద్దీన్, బలపరిచిన వారిగా గొల్లా గోపినాథ్ ఉన్నారు. ప్రత్యేక అధికారి ఎన్నిక ఫలితాలను అధికారికంగా ప్రకటించి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డి.ఈ. హరి భువన్, తాహసిల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ వైస్ చైర్మన్



మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ అప్పల కావ్య గణేష్ చక్రవర్తిని ఘనంగా సన్మానించిన కలెక్టర్ అభిలాష అభినవ్



కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్

నిర్మల్ ఫిబ్రవరి 16 అమృత్ తెలంగాణ నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అప్పాల కావ్య, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అప్పాల గణేష్ చక్రవర్తి సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్కను అందజేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన వారికి కలెక్టర్ వారిని శాలువా, జ్ఞాపికతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పట్టణ సర్వతోముఖాభివృద్ధికి జిల్లా యంత్రాంగం సహకారం అందించాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షల సన్నద్ధతపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రతను దృష్టిలో ఉంచుకుని, వారికి ప్రోటీన్లతో కూడిన పౌష్టికాహారాన్ని (రాఖుఎం) అందించాలని ఆదేశించారు. వార్షిక పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులు 100 శాతం హాజరయ్యేలా చూడాలని, ముఖ్యంగా ఉదయం వేళల్లో విద్యార్థులు సమయానికి పాఠశాలకు వచ్చేలా ఎం.ఇ.ఓలు పర్యవేక్షించాలని సూచించారు. ఫిబ్రవరి 18 నుండి జరగాల్సిన ప్రీ-ఫైనల్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా జరుగుతాయని, ఉపాధ్యాయులందరూ దీనికి సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు స్థానికంగా ఉన్నత స్థాయికి చేరుకున్న వ్యక్తులతో మోటివేషన్ క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత ఏడాది తరహాలోనే విద్యార్థులు త్వరగా నిద్రలేచి చదువుకునేలా ఉపాధ్యాయులు 'వేకప్ కాల్స్' ద్వారా వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులందరూ 100 శాతం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, డి.సి.బి సెక్రటరీ గజేందర్, ఏ.ఎం.ఓ అజయ్, ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లు, మండల విద్యాశాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వర్ణగిరిలో గిరి ప్రదక్షిణ

భువనగిరి :అమృత్ తెలంగాణ: తెలంగాణ ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి దేవస్థానంలో సోమవారం రోజు శ్రవణా నక్షత్రం వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఉదయం 6 గంటల 30 నిమిషాలకు స్వర్ణగిరి క్షేత్రంలోని స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు, చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణల ఆదేశాల మేరకు గిరి ప్రదక్షణ యొక్క విశిష్టతను భక్తులకు వివరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి గోవింద నామాలను స్మరిస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించు కుని దివ్యానుభూతిని పొందారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై విరుచుకుపడ్డ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్

## ఇది ప్రజాపాలన కాదు గూండాల పాలన అంటూ మండిపాటు.....



ధర్నా నిర్వహించిన బిఎస్పి కార్యకర్తలు

హైదరాబాద్ అమృత్ తెలంగాణ ప్రజాపాలన ముసుగులో రేవంత్ రెడ్డి రౌడీ పాలన చేస్తున్నారు అని మండిపడ్డారు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్,. ఈ నెల 13న వెలువడిన తెలంగాణ మునిసిపల్ ఎన్నికల ఫలితాల సందర్భంగా బీఎస్పీ నుండి గెలిచిన అభ్యర్థులను కాంగ్రెస్ నాయకులు భయబ్రాంతులకు గురిచేసి కిడ్నాప్ చెయ్యడాన్ని నిరసిస్తూ,ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దా నిర్వహించిన శాంతియుత ధర్నా లో బీఎస్పీ అభ్యర్థులను కిడ్నాప్ చేసి,రేవంత్ రెడ్డి వర్గం రాజ్యాంగ ఉల్లంగనలకు పాల్పడ్డారు అని దుయ్యబట్టారు. మర్యాదగా మా పార్టీ నుండి గెలిచిన అభ్యర్థులను విడిచిపెట్టకపోతే కారకుల ఇండ్లను ముట్టడిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీఎస్పీ జాతీయడరాష్ట్ర కోఆర్డినేటర్ లు రాష్ట్ర నాయకులు, అన్ని జిల్లాల , నియోజకవర్గ,మండల,మునిసిపల్ నాయకులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేసిన సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.



జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సారంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ జి ఫిబ్రవరి 16 అమృత్ తెలంగాణ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని నిర్మల్ పట్టణం లోని మాజీ మంత్రి , కి జన్మదిన సందర్భంగా వారి నివాసం లో సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో కౌట్ల పిఏసిఎస్ చైర్మన్ అయిర నారాయణ రెడ్డి, అడెల్లి పోచమ్మ దేవస్థాన చైర్మన్ సింగం భోజగౌడ్, సారంగాపూర్ మండల మాజీ ఎంపీపీ అట్లా మహిపాల్ రెడ్డి, అడెల్లి టెంపుల్ మాజీ చైర్మన్ లు మాధవరావు , అయిటి చందు , ఆలూరు సొసైటీ మాజీ ఉప అధ్యక్షులు లక్ష్మి నారాయణ, నాయకులు పాతని భూమేష్, కాంగ్రెస్ పార్టీ సారంగాపూర్ మండల సోషల్ మీడియ కో ఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్, తదితరులు పాల్గొన్నారు

# మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎంపీ జి నగేష్ మీద మాజీ మంత్రి జోగు రామన్న ఫైర్




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి జోగు రామన్న

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ అదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ స్వతంత్ర అభ్యర్థి బండారి అనూష కు బిఆర్ఎస్ పార్టీ మద్దతు తెలుపడం జరిగింది అటు 21 స్థానాలు గెలిచిన బిజెపి పార్టీకి మద్దతు నిలవకుండా స్వతంత్ర అభ్యర్థికి జై కొట్టడం జరిగింది తన సొంత పార్టీ బిజెపికి మద్దతు ఇవ్వకపోవడం లో అదిలాబాద్ ఎమ్మెల్యే అంతరాయం ఏమిటి స్వతంత్ర అభ్యర్థులను కలుపుకొని అవకాశమున్న కూడా వెనుకంజ వేయడంలో అంతరాయం ఏంటి ఒకపక్కనేమో మహారాష్ట్ర అమరావతి లో ఎంఐఎంతో పొత్తులో ఉండి పీఠం దక్కించుకోవడం జరిగింది . ఇటు తెలంగాణలో కూడా అమంగల్ మున్సిపాలిటీలో బిజెపి కాంగ్రెస్ పొత్తులో పీఠం దక్కించుకోవడం జరిగింది .

మన ఆదిలాబాద్ లో అవకాశము ఉండి కూడా వెనుకంజ వేయడంలో మతలబేమిటి మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# తొలి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా బుర్రి చైతన్యరెడ్డి



నల్లగొండ :అమృత్ తెలంగాణ: నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్ గా బుర్రి చైతన్య రెడ్డి, డిప్యూటీ మేయర్ గా అస్రఫ్ అలీ మొహమ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా వ్యవసాయ అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రత్యేక అధికారి శ్రవణ్ ఆధ్వర్యంలో మేయర్, డిప్యూటీ మేయర్ ల ఎన్నికలను నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. బుర్రి చైతన్య రెడ్డి ని మేయర్ గా కార్పొరేటర్ పేర్ని స్వాతి ప్రతిపాదించగా 40 డివిజన్ కార్పొరేటర్ అల్లి సుభాష్ చంద్రబోస్ బలపరిచారు.

డిప్యూటీ మేయర్ గాఅస్రఫ్ అలీ మొహమ్మద్ ను మోహన్ ప్రతిపాదించగా నవీన్ గౌడ్ బలపరిచారు. మేయర్ డిప్యూటీ మేయర్ కు కేవలం ఒక్కొక్క నామినేషన్ మాత్రమేరావడంతోఏలాంటిపోటీలేదని మేయర్, డిప్యూటీ మేయర్లను కార్పొరేటర్లందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రత్యేక అధికారి ప్రకటించారు.

# ఆత్మవిశ్వాసంతో ఆడి.. జిల్లా పేరు నిలబెట్టాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా



జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా




బస్సులో కూర్చున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జిల్లా కీర్తిని పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకాంక్షించారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు బయలుదేరిన విద్యార్థుల బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శారీరక, మానసిక వైకల్యాలను అధిగమించి క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికితీసి పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత ఫలితాలు సాధ్యమని తెలిపారు. క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని జిల్లాకు పతకాలు సాధించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు రఘు రమణ, షుజాత్ ఖాన్, ఇతర అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి : జిల్లాలో ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు జరగనున్న పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ఈసారి విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్ కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమైనప్పటికీ, 9:05 నిమిషాల వరకు విద్యార్థులను అనుమతిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. అదనంగా 9 మంది సీఎస్ఓలను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల రవాణా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్లలో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత మధ్య రవాణా చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, డిజిటల్ గడియారాలు, మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు అధికారులు, సిబ్బందికీ వర్తిస్తాయని తెలిపారు. పరీక్షల సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపాలని, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స కిట్లతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 అమలు చేసి, సీసీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షలు ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గణేష్ జాదవ్‌తో పాటు ఆర్టీసీ, వైద్య, విద్యుత్, పోలీస్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్

## కండువా కప్పి స్వాగతించిన సుదర్శన్ రెడ్డి






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆదిలాబాద్ . ప్రజాస్వామ్యంలో అభివృద్ధి కోసం కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకోవడం సరైన దేనని ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికల పార్లమెంటు ఇంచార్జి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు .అదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన బండారి అనూష సతీష్ లు సోమవారం నిజమాబాదులోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు .వారిని ముందుగా అభినందించి శాలువాలతో సత్కరించారు .అనంతరం కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. తమది సెక్యులర్ పార్టీ అని ఇతర సెక్యులర్ పార్టీల మద్దతుతో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అదిలాబాదులో మున్సిపల్ చైర్ పర్సన్ పీఠం దక్కించుకోవడం హర్షనీ యమన్నారు . ఇందుకు సహకరించిన కౌన్సిలర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు .అలాగే ఆదిలాబాద్ నేతలందరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్, ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాసరెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్, గంద్రత్ సుజాత, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, అశ్విన్ రెడ్డి ,పత్తి ముజ్జు, కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



నల్లగొండ : అమృత్ తెలంగాణ: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. సోమవారం నల్లగొండ కార్పోరేషన్ మేయర్ డిప్యూటీ మేయర్ తోపాటు మరో 6 మున్సిపాలిటీలలో చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎన్నిక సందర్భంగా భారీ పోలీసులు బందోబస్త నిర్వహించారు. ఎస్పీ జిల్లా కేంద్రంలో కార్పొరేషన్ ఎన్నిక ప్రక్రియలో పోలీస్ బందోబస్తును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఆరు మున్సిపాలిటీలలో నిర్వహించిన మేయర్/ డిప్యూటీ మేయర్, చైర్మన్/ వైస్ చైర్మన్ ల ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసినట్లు జిల్లా ఎస్పీ , తెలిపారు. ఎన్నికల బందోబస్త్ ప్రక్రియను పర్యవేక్షించిన ఎస్పీ మాట్లాడుతూ. ప్రజాస్వామ్య రాజ్యాంగబద్ధ ప్రక్రియను కాపాడేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది అని చెప్పారు.. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి దశలోనూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాటు చేసి,అభ్యర్థులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా గుంపులు గుమికూడడం, నినాదాలు చేయడం, ఉద్రిక్తతలకు దారితీసే చర్యలను పూర్తిగా నిషేధించి శాంతి భద్రతలను కాపాడినట్లు వివరించారు.

# రాబరీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్, రిమాండ్.

**ఆదిలాబాద్ పట్టణం మార్కెట్ యార్డ్ వద్ద ఘటన.**
**టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు.**
**రాబరీ చేసిన సెల్ ఫోన్, బైక్ తిరిగి స్వాధీనం.**
**ప్రధాన నిందితునిపై ఇదివరకే ఇలాంటి నేరాల కేసులు నమోదు.**
**టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు.**

**నిందితుల వివరాలు**

A1) వసీం ఖాన్ (24) s/o మతిన్ ఖాన్, క్రాంతి నగర్.
A2) అఫ్రోజ్ ఖాన్ (30) s/o భూరీ ఖాన్, క్రాంతి నగర్ ఆదిలాబాద్.




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డ్ వెనుక భాగంలో జరిగిన రాబరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు తెలిపారు. ఈ ఘటనపై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. గత శనివారం రాత్రి గుమ్మడి సాయికిరణ్ అనే బాధితుడు తన విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మార్కెట్ యార్డ్ వెనుక భాగంలో నిందితులు వసీం ఖాన్ (24), అఫ్రోజ్ ఖాన్ (30) అతన్ని అడ్డగించి డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. బాధితుని వద్ద డబ్బులు లేకపోవడంతో అతని బైక్‌పై ఎక్కి సమీప కిరాణా షాపుకు వెళ్లి మొబైల్ ఫోన్ తాకట్టు పెట్టి సిగరెట్లు తీసుకున్నారు. అనంతరం సిగరెట్టుతో బాధితుడిని కాల్చి గాయపరిచి బైక్‌పై పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన టూ టౌన్ పోలీసులు నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి దోపిడీ చేసిన సెల్‌ఫోన్ మరియు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిపై ఇదివరకే ఇలాంటి నేరాల కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు వెల్లడించారు. ఇలాంటి నేరాలపై జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ సిబ్బంది క్రాంతి, కిషన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని కోట్లకు బీఆర్ఎస్ కౌన్సిలర్లను అమ్ముకున్నావు జోగు రామన్న కు ఎమ్మెల్యే పాయల్ ఫైర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : గెలిచిన 6గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లను ఎన్ని కోట్లకు కాంగ్రెస్ కు అమ్ముకున్నవో ప్రజలకు చెప్పాలని మాజీ మంత్రి జోగు రామన్న ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్, ఎంఐఎం లకు జోగురామన్న అమ్ముడు పోయి హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగావ్యవహరించారని ఆరోపిస్తు, ఈ వ్యవహారం తో ఒక నుండి జోగు రామన్న కాదనీ అలియాస్ జోగు రఫీఉ ద్దీన్ అంటూ ఎద్దేవ చేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీ గోడం నగేష్, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీజేపీ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ అనైతిక పొత్తులకు పాల్పడ్డారన్నారు. గతములో అబివృద్ధి పనుల కోసం తాను, ఎంపీ గోడం నగేష్ ఇద్దరం సీఎం రేవంత్ రెడ్డి ని కలిస్తే కాంగ్రెస్ బిజెపి ఒక్కటేనని గగ్గోలు పెట్టిన జోగు రామన్న ఇప్పుడు ప్రజలకు ఏమి సమాధానమిస్తాలో చెప్పాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ లు వ్యవహరించిన తీరును ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ కు ఏర్పోర్ట్ తో పాటు రైల్వే అండర్, ఓవర్ బ్రిడ్జ తో పాటు వందల ల కోట్ల నిధులు కేంద్రం నుండి తీసుకురావడం చూసి కళ్ళల్లో కారం కొట్టినట్లు అయిన జోగు రామన్న కడుపు మంటతో ఈ కుట్రకు తెరలేపారని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు జోగు రామన్న అలియాస్ జోగు రఫీఉద్దీన్ నిజస్వరూపం ఏంటో గుర్తు ఎరగాలని ప్రజలను కోరారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కి ఆహ్వానం



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నారని ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరు కావాలని గ్రామస్తులు ఆహ్వాన పత్రికను అందజేశారు

# రాయికల్ మున్సిపల్‌పై ఎగిరిన బీఆర్ఎస్ జెండా

రాయికల్ :అమృత్ తెలంగాణ: రాయికల్ పట్టణ మున్సిపాలిటీలో జరిగిన రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు ఉత్కంఠభరిత రాజకీయ పరిణామాలకు వేదికయ్యాయి. స్థానాల పరంగా బీజేపీ ఐదు వార్డులు గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచినా.. బీఆర్ఎస్(3), కాంగ్రెస్ (3), స్వతంత్ర (1) సభ్యుల కూటమి మెజారిటీ సాధించి పాలక మండలిని తమ ఆధీనంలోకి తీసుకుంది. దీంతో రాయికల్ మున్సిపల్‌పై బీఆర్ఎస్ జెండా ఎగిరింది. మున్సిపల్ చైర్మన్ పదవికి బీఆర్ఎస్ తరఫున రెండవ వార్డు కౌన్సిలర్ కట్కం రవీందర్‌ను ప్రతిపాదించారు. నాల్గవ వార్డు కౌన్సిలర్ తురగ సౌజన్య ప్రతిపాదించగా.. ఏడవ వార్డు కౌన్సిలర్ ఎలిగేటి లతిక బలపరిచారు. బీజేపీ తరఫున 12వ వార్డు కౌన్సిలర్ కల్లెడ ధర్మపురిని కూనారపు మానస ప్రతిపాదించగా.. తోపరపు ప్రశాంతి బలపరిచారు. వైస్ చైర్మన్ పదవికి బీఆర్ఎస్ నుంచి నాల్గవ వార్డు కౌన్సిలర్ తురగ సౌజన్యను ప్రతిపాదించగా.. ఎలిగేటి లతిక బలపరిచారు. బీజేపీ తరఫున 11వ వార్డు కౌన్సిలర్ పుర్రె శ్రీధర్‌ను తోపరపు ప్రశాంతి ప్రతిపాదించగా.. వేముల మౌనిక బలపరిచారు.

# అరోరా యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ

భువనగిరి : అమృత్ తెలంగాణ:యూనివర్సిటీలో గుర్తింపును రద్దు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కార్యదర్శి లావుడియ రాజు అన్నారు. సోమవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరిలో ఉన్న అరోరా యూనివర్సిటీలో సమస్యలను పరిష్కరించాలని అరోరా యూనివర్సిటీ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మాట్లాడుతూ ఎన్ఐటి పేరుతో అడ్మిషన్ తీసుకొని యూనివర్సిటీ జతకట్టినారు. అరోరా యూనివర్సిటీ అడ్మిషన్ సమయంలో ఏఐతో వీడియో చేసి వీడియోలో ఉన్నట్లుగా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు ఉంటాయని నమ్మించి, విద్యార్థుల నుండి రూ.10 నుండి 11 లక్షలు పాటు ఫీజులు తీసుకుంటున్నారని తెలిపారు.

యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేకసార్లు యజమాని దృష్టికి తీసుకెళ్లడానికి చూసి చూడనట్టుగా వివరిస్తున్నారని ఆరోపించారు. హాస్టల్లో విద్యార్థులకు సరైన భోజనం పెట్టాక దానిమీద భోజనం పెట్టక తినే తినకుండా ఉన్నటువంటి పరిస్థితి ఉన్నది, హాస్టల్లో సరిపడా మౌలిక సదుపాయాలు లేక కాలయాపన చేస్తున్నారు, విద్యార్థులతో యూనివర్సిటీ యజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, బయట హాస్టల్ నుంచి వస్తున్న విద్యార్థులకు బస్సులను యూనివర్సిటీలో రానీయకుండా రోడ్లమీద ఆపుతున్నారు.

యూనివర్సిటీకి సరైన రోడ్లు లేక , ఆట స్థలం లేక యూనివర్సిటీలో ఆడిటోరియం, సెమినార్ హాల్ లేక కాలం గడుపుతున్నారు, విద్యార్థులకు న్యాయమైన భోజనం



అందక విద్యార్థులు చదువు దూరమయ్యే పరిస్థితి నెలకొందని, యజమాన్యం త్వరగా స్పందించి సమస్యను పరిష్కరించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న యూనివర్సిటీపై చర్యలు తీసుకొని యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని సుబ్బయ్య డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అధికారులు ధర్నా దగ్గరకు వచ్చి యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేస్తానని తెలియజేయడంతో విద్యార్థులు ధర్నా విరమించడం జరిగిందనారు.

యూనివర్సిటీలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఎడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్,నాగరాజు, తీగల శ్రీనివాస్, జగన్ నాయక్, ఉదయ్ ,పట్టణ అధ్యక్షులు నేహాల్ లు పాల్గొన్నారు.

# ఆకుల యాదగిరి కుటుంబ సభ్యుల ఆందోళన



ఇబ్రహీంపట్నం:అమృత్ తెలంగాణ: ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన దిగారు. ముందుగా కాంగ్రెస్ ఎనిమిది మంది కౌన్సిలర్లతో పాటు స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి బీజేపీ కౌన్సిలర్ తో కలిసి సమావేశం మందిరానికి ముందుగా చేరుకున్నారు. సుమారు అరగంట ఆలస్యంగా ప్రత్యేక వాహనంలో 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఒకటో వార్డు బీజేపీ కౌన్సిలర్ తో మంది సమావేశం మందిరంలోకి చేరుకున్నారు. వీరిలో బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి లేకపోవడంతో ఆయన సతీమణి ఆకుల వసంత, కుమారుడు టోనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఒకసారి ఆందోళన దిగారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశం మందిరంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. “మా ఆయన ఎక్కడ” అంటూ నిలదీశారు. సీనియర్ కౌన్సిలర్ గా ఆయన్ను సమావేశానికి రాకుండా అడ్డుకోవడం ఆందోళన కలిగిస్తుందని మండిపడ్డారు. టేకుల సుదర్శన్ రెడ్డికి కౌన్సిలర్లు అమ్ముడుపోయారని, అందుకే మా ఆయనను చైర్మన్ కాకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని ఆరోపించారు. దాంతో పోలీసులు వారిని పక్కకు నెట్టివేశారు. ఇదిలా ఉంటే స్వతంత్ర అభ్యర్థి దాసరి మురళి కృష్ణ సమావేశ మందిరానికి ఒంటరిగా చేరుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు కలిశారు. సమావేశం మందిలోకి వెళ్తుండగా అడ్డుకొని ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ కు ఓటు వేయవద్దని, కాంగ్రెస్ కి ఓటు వేయాలని కొడుకు మురళి కృష్ణకు సూచించారు. దాంతో మున్సిపల్ కేంద్రం వద్ద ఆందోళన పరిస్థితులు ఏర్పడ్డాయి.

# ఇబ్రహీంపట్నం మున్సిపల్‌లో ఉద్రిక్తత

ఇబ్రహీంపట్నం:అమృత్ తెలంగాణ: ఇబ్రహీంపట్నం మున్సిపల్‌లో రచ్చ కొనసాగుతోంది. మరోసారి సమావేశానికి హాజరు కాలేకు పోయిన ఆటో యాదగిరి సతీమణి కుటుంబ సభ్యులు కౌన్సిల్లోకి దూసుకు వచ్చారు. పోడియం ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ ఆకుల యాదగిరిని రప్పించాలని అప్పటి వరకు ఎన్నిక ఆపాలని నినాదాలు చేశారు. భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతున్న ఆకుల యాదగిరి కుటుంబ సభ్యులు కౌన్సిల్లోకి వచ్చి ఆందోళన చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పోలీసులు ఆందోళనకారులను బయటకు తీసుకువచ్చారు. ఆర్డీవోతో ప్రత్యేకంగా మాట్లాడించారు. కాంగ్రెస్ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్ సభ్యులు ఆకుల యాగిరిని సమావేశానికి రప్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు ఒక్కసారిగా ఆ పొడియాన్ని చుట్టుపెట్టారు. అప్పటి వరకు సమావేశాన్ని వాయిదా వేయాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు కప్పరి స్రవంతి, ఇందూరు శ్రీనివాస్, నీలంబాను రాందాసు తదితర సభ్యులు ఒక్కసారిగా ఎన్నికల అధికారి కే అనంతరెడ్డిని చుట్టుముట్టారు. దీంతో మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమావేశాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు.

మరోవైపు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం పై రాళ్ల దాడులు ఆయా పార్టీల మద్దతుదారులు. అప్రమత్తమైన పోలీసులు ఆందోళకారులను చెదరగొట్టారు. భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

కౌన్సిల్లో పార్టీలు బలాబలాలు..

మున్సిపల్ సమావేశానికి ఆకుల యాదగిరి మినహా ఎక్స్ అఫీషియ సభ్యులుతో కలుపుకొని 24 మంది హాజరయ్యారు. వీరిలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొన్ని ప్రవీణ్ కుమార్, జేర్కొని మమతా రాజు కేకుల సుదర్శన్ రెడ్డి, కొంద్రు శ్రీలత రాంబాబు, కొండిగారి త్రిలోక్, క్యామ శంకర్, అల్వాల జ్యోతి వెంకట రెడ్డి, మడుపు లక్ష్మమ్మ,



మంద జయ, చిలకల బుగ్గరాములు, నీలం శ్వేత, గూడూరీ గిరీష్ హాజరుకాగా స్వతంత్ర అభ్యర్థి దాసరి మురళీకృష్ణ వీరి వెంట ఉన్నాను. ఇక బిజెపి మొదటి వార్డ్ అభ్యర్థి ముత్యాల శ్యామల భాస్కర్ బీఆర్ఎస్ మద్దతు ఇస్తున్నారు. ఇక కాంగ్రెస్ కౌన్సిలర్లను పరిశీలిస్తే..నీళ్ల భాను బాబు గౌడ్, మహమ్మద్ అమీనా బేగం,వి రాందాస్, దారు రాఘవేంద్రరావు, దొంతరమోని అని భార్గవి రాజు, ఇందూరి శ్రీనివాస్, ఏదులా విజయలక్ష్మి వెంకట్ రెడ్డి, కప్పర స్రవంతి చందు హాజరు కాగా బిజెపి కౌన్సిలర్ సిద్ధం భానుప్రియ కాంగ్రెస్ కు మద్దతు ఇస్తున్నారు. రంగారెడ్డి కాంగ్రెస్ వెన్నంటి ఉన్నారు.


రెండుగా చీలిన బీజేపీ..

ఇబ్రహీంపట్నంలో కేవలం రెండు వార్డుల్లో విజయం సాధించిన బీజేపీ రెండుగా చీలిపోయింది. ఒకరు ముత్యాల శ్యామల భాస్కర్ టిఆర్ఎస్‌కు మద్దతు ఇస్తుండగా.. 18వ వార్డు కౌన్సిలర్‌గా గెలిచిన సిద్ధం భానుప్రియ మాత్రం కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారు. దీంతో బీజేపీలో వర్గపోరు బయటపడింది.

# మస్తు బందోబస్తు..క్షణ క్షణం ఉత్కంఠం

ఇబ్రహీంపట్నం:అమృత్ తెలంగాణ: చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా మారింది క్షణక్షణం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.పోలీసులు మస్తు బందోబస్తు ఏర్పాటు చేశారు. 400 మందితో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇబ్రహీంపట్నం పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పోలీసులు తమ కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఇబ్రహీంపట్నం ఏసీబీ కేపీవి రాజు హెచ్చరిక జారీ చేశారు. మనము చట్టం పక్షం తప్ప ఎవరి పక్షం కాదని గుర్తు చేశారు ఏ రాజకీయ పక్షానికి ఫోన్ల ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా సమాచారం ఇస్తే చర్యలు తప్పమని హెచ్చరించారు ఇప్పటికే 12 మంది తమ దృష్టిలో ఉన్నారని గుర్తు చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు పాలకవర్గ సభ్యులు హాజరు కావాల్సి ఉంది. అందుకు ఇబ్రహీంపట్నం ఆర్డిఓ కే అనంతరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు ఏర్పాటు సిద్ధం చేశారు. సమావేశ మందిరాన్ని సైతం ఎన్నికకు అనుగుణంగా సిద్ధం చేసి ఉంచారు. బీఆర్ఎస్ ఏఫామ్, బీఫామ్ సమర్పణం..

మున్సిపల్ ఎన్నికల్లో పూర్తి మెజార్టీ సాధించిన బీఆర్ఎస్



పార్టీ చైర్మన్ ఎన్నికకు సంసిద్ధంగా ఏర్పాటు సిద్ధం చేసుకుంది అందుకు అనుకూలంగా ఉదయం 9 గంటల సమయంలో ఆ పార్టీ రాసి నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం చేరుకొని తమ ఫ్యానాల్ తరఫున ఏ పాము బి ఫామును ఎన్నికల అధికారులకు సమర్పించారు. అదేవిధంగా ఉదయం 10గంటల 15 గంటలకు కాంగ్రెసు తరపున ఆ పార్టీ కౌన్సిలర్లు నీలం బాను బాబు, దారు రాఘవేందర్రావు ఎన్నికల అధికారులకు ఏ ఫామ్, బీఫామ్ సమర్పించారు. 10.17 గంటలకు స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి కాంగ్రెస్ తరపున గెలిచిన ఎనిమిది మంది కౌన్సిలర్లు సమావేశ మందిరంలోకి చేరుకున్నారు.


# చీర కట్టులో సిగ్గు పడుతూ డర్టీ బ్యూటీ




చిలసౌ.. హిట్.. డర్టీ హరి సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన ముద్దుగుమ్మ రుహాని శర్మ. ఇప్పటి వరకు ఈ అమ్మడు ఏ సినిమాలో కూడా స్కిన్ షో చేయలేదు. కొన్ని సినిమాల్లో కాస్త రొమాంటిక్ గా నటించినా కూడా ఈమె స్కిన్ షో విషయంలో దూరంగా ఉంటుందా అనిపించేలా ప్రతి సినిమాలో కూడా ఆమె ధరించిన కాస్ట్యూమ్స్ ఉన్నాయి. చిలసౌ పద్దతైన ఒక మధ్యతరగతి అమ్మాయి కనుక అందులో స్కిన్ షో కి స్కోప్ లేదు.. హిట్ లో కూడా అదే తరహా పాత్ర.. ఇక డర్టీ హరి సినిమాలో టైటిల్ డర్టీ గా ఉన్నా.. సినిమా మొత్తం డర్టీ గా ఉన్నా ఈమె పాత్ర మాత్రం చాలా నీట్ గా పద్ధతిగా ఉంటుంది. కనుక రుహాని కి ఆ తరహా పాత్రలే ఎక్కువగా వస్తున్నాయి. అవకాశం ఇవ్వాలే కానీ... అవసరం రావాలే కానీ తాను స్కిన్ షో విషయంలో తక్కువేం కాదు అంటూ ఇటీవల ఇన్ స్టా లో షేర్ చేసిన ఫోటోలను చూస్తే అర్థం అవుతుంది. అందాల ముద్దుగుమ్మ స్కిన్ షో చేయడంతో పాటు ఇటీ చీర కట్టులో కూడా చాలా అందంగా ఉంటుంది అంటూ ఈ ఫోటో ను చూస్తుంటే అనిపిస్తుంది. కనిపించి కనిపించకుండా క్లీ వేజ్ షో చేస్తూ చీర కట్టు లో ఇలా ముసి ముసిగా నవ్వుతూ సిగ్గు పడుతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చిన రుహాని శర్మ ని చూస్తుంటే గుండె జారి గల్లంతవుతుంది అంటూ చాలా మంది అబ్బాయిలు ఇలాంటి అమ్మాయి పెళ్లాంగా వస్తే ఎంత బాగుంటుందని అనుకుంటున్నారట. ప్రస్తుతం మీట్ క్యూట్ అనే సినిమాలో నటిస్తున్న ఈమె ఆగ్ర అనే హిందీ సినిమాలో కూడా నటిస్తోంది.

# మనోహారి దెబ్బకు కంటికి కునుకు కరువే

బాహుబలి మనోహరిగా నోరా ఫతేహికి ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. బాలీవుడ్ లో ఐటమ్ గాళ్ గా నర్తిస్తూనే కొన్ని ప్రధానపాత్రలు పోషిస్తూ తన ఉనికిని చాటుకుంటోంది. ఇక ఆల్ రౌండర్ డ్యాన్సింగ్ క్వీన్ గా బుల్లితెరను ఈ భామ ఏల్తోంది. డ్యాన్స్ రియాలిటీ షోలకు నోరా జడ్జిగా వ్యవహరిస్తూ వేదికను హీటెక్కిస్తోంది. ఈ మొరాకో బ్యూటీ అందచందాలు డ్యాన్సింగ్ ప్రతిభకు టీఆర్పీలు పరుగులు పెడుతున్నాయి. ఇక సోషల్ మీడియాల్లో నిరంతరం యువతరానికి కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటివ్వడంలో నోరా మాస్టర్ డిగ్రీలెన్నో పూర్తి చేసింది. తాజా ఈవెంట్లో నోరా ఫతేహి తన హాటెస్ట్ కటౌట్ తో మెరుపులు మెరిపించింది. పసుపు రంగు బాడీ-ఫిట్టింగ్ గౌనులో ఒంపుసొంపుల యవ్వనాన్ని ప్రదర్శించింది అయితే దీనికి నెటిజనులు వెంటనే స్పందిస్తూ..సిలికాన్ సిలికాన్ అందాల వల! అంటూ ట్రోల్ చేస్తున్నారు. నోరా ఫతేహికి షో స్టాపర్ గా నిలవడం ఎలానో క్లారిటీగా తెలుసు . బోయ్స్ కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటివ్వడం వెన్నతో పెట్టిన విద్య. ఇటీవల సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి థ్యాంక్స్ గాడ్ పాట ‘మణికే...’లో మెరుపులు మెరిపించింది. ఈ జంట అద్భుతమైన కెమిస్ట్రీ మంటలు పుట్టించింది. నిన్న రాత్రి ఒక అవార్డ్ ఫంక్షన్ లో నోరా కనిపించిన తీరు మతులు చెడగొట్టింది. ఆరడుగుల ఆ కటౌట్ అగ్గి రాజేసింది. ప్రఖ్యాత బెస్ట్ డ్రెస్డ్ 2022 అవార్డులు ముంబైలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలో అందాల తారకలు మెరుపులు మెరిపించారు. అందరిలో నోర కేంద్రక ఆకర్షణగా నిలిచిందంటే అతిశయోక్తి కాదు. ఈషా గుప్తా- చిత్రాంగద సింగ్- అలయ ఎఫ్- రోహిత్ సరాఫ్- పూజా హెగ్డే- రియా చక్రవర్తి సహా అందగత్తెలు అత్యుత్తమ ఫ్యాషన్ తో అలరించారు. నోరా ఫతేహి పసుపు రంగు థై స్లిట్ దుస్తుల్లో అందాలను ఆరబోసింది. ఒంపుసొంపులను వడ్డించేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టని డిజైనర్ లుక్ తో మతులు చెదరగొట్టింది. ఝలక్ దిఖ్లా జా జడ్జి గా



ఈ సూపర్ లుక్ పై నెటిజన్లు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. చాలామంది ఆమెను ఉర్ఫీ జావేద్తో పోల్చారు. వీడియోపై వ్యాఖ్యానిస్తూ ఒక నెటిజను ఇస్కీ భీ ఆదర్శ ఉర్ఫీ హై ఎల్జితా హై అని రాశారు. మరొకరు సుకేష్ చంద్రశేఖర్ వివాదంపై స్పందించి “జైల్ వాలే భయ్యా కా పైసా కహా హై” అని రాశారు. “ప్రతిచోటా సిలికాన్ సిలికాన్” అని మరొకరు వ్యాఖ్యానించారు. “సబ్ ఉర్ఫీ కె కడమో పే చల్ రహే హే.. చియా” అని ఒక వ్యాఖ్య మీనింగ్. “యే సబ్ సెలబ్రిటీ పాగల్ హెూ గై హై పైసే కె లియే కుచ్ భీ కరేంగి కుచ్ భీ పెహ్నేగీ సబ్ ఏక్ జైసీ బాలీవుడ్ మే” అని ఒక ట్రోలర్ వ్యాఖ్యానించాడు.

## సమంత ఫ్యాన్స్ ని ఊరించి ఉసూరుమనిపించారు


సమంత ప్రధాన పాత్రలో గుణశేఖర్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న శాకుంతలం సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సమంత అభిమానులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరు కూడా శాకుంతలం సినిమా కోసం వెయిట్ చేస్తున్న సమయంలో విడుదల తేదీ పై క్లారిటీ ఇవ్వక పోడంతో దర్శక నిర్మాత గుణశేఖర్ పై తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెల్సిందే. షూటింగ్ పూర్తి అయ్యి చాలా నెలలు అవుతున్నా కూడా ఇంకా సినిమా విడుదల తేదీని ప్రకటించక పోవడం ఏంటీ.. అసలు సినిమా ఉందా.. ఔట్ పుట్ సరిగా రాలేదని వదిలేశారా అంటూ సమంత అభిమానులు రకరకాలుగా కామెంట్స్ చేశారు. ఫ్యాన్స్



ఒత్తిడి కారణమో లేదా మరేంటో కానీ సినిమా యొక్క విడుదల తేదీని ఇటీవలే గుణశేఖర్ టీమ్ ప్రకటించిన విషయం తెల్సిందే. నవంబర్ 4వ తారీకున సినిమాను విడుదల చేయబతోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన రావడంతో అభిమానులు సంతోషించారు. మరీ ఇంత తక్కువ గ్యాప్ తో విడుదల తేదీని ప్రకటిస్తారని అనుకోలేదు అంటూ గుణశేఖర్ కి కృతజ్ఞతలు కూడా చెప్పారు. సమంత అభిమానులు ఆనందంతో కౌట్ డౌన్ కూడా మొదలు పెట్టారు. ఆ తేదీన రావాలనుకున్న ఇతర సినిమాలు వాయిదా పడ్డాయి.




# మృణాల్ హాట్ కంటెంట్ పెంచేస్తోందిగా..



దుల్కార్-మృణాల్ ఠాకూర్- రష్మిక మందన ప్రధాన తారాగణంగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన పీరియాడికల్ రొమాంటిక్ డ్రామా ‘సీతారామం’ ఆగస్ట్ 5న తెలుగు- తమిళం- మలయాళ భాషల్లో విడుదలై బాక్సాఫీస్ వద్ద పెద్ద సక్సెసైన సంగతి తెలిసిందే. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గదా సమర్పణలో ఈ చిత్రం హిందీలో సెప్టెంబర్ 2న సినిమా థియేటర్లలో విడుదలైంది. అక్కడా చక్కని ఆదరణ దక్కించుకుంది. హిందీ పరిశ్రమకు సుపరిచితురాలైన అందాల కథానాయిక మృణాల్ ఠాకూర్ తనవంతు ప్రచారం తో అభిమానులకు మరింత చేరువైంది. నేను దక్షిణాది సినిమాల్లో ఇంతకంటే మంచి అరంగేట్రాన్ని కోరుకోను.. నేను పొందుతున్న ప్రేమ అపురూపమైనదని మృణాల్ ఇంతకుముందే ఆనందం వ్యక్తం చేసింది. హను రాఘవపూడి దర్శకత్వం వహించిన ఈ పీరియాడికల్ రొమాంటిక్ డ్రామా కథాంశం ఆసక్తికరం. ఈ మూవీ కథ దేశభక్తి చుట్టూ తిరుగుతుంది. ఇందులో దుల్కార్ సల్మాన్ అందమైన హంక్ ఆర్మీ ఆఫీసర్ గా నటించాడు. ఈ సినిమాలో దుల్కర్.. మృణాల్ నటనకు ప్రశంసలు తతదక్కాయి. యుద్ధం సరిహద్దులు మతం కంటే మానవత్వమే ముఖ్యమన్న వాస్తవాన్ని హను తెరపై ఎంతో హృద్యంగా అందంగా చూపించారు. అన్ని వర్గాల ప్రేక్షకులకు ఈ సినిమా చేరువైంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com